ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | సెప్టెంబరు 25, 2026 | సంపుటి : 7 | సంచిక : 98 | పేజీలు : 2

ఎమ్మెల్యేగా దానం అనర్హుడే

పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

- ఆయనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం

హైదరాబాద్, ఆయుధం: దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది.



ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఫుర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతున్నారని వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహేంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును సమర్థించింది.

తీర్పు ను స్వాగతిస్తున్నా: దానం

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించిన సందర్భంగా ఆయన స్పందించారు. తనకు ప్రజా క్షేత్రంలో బలం ఉందని తెలిపారు. తాను ప్రతి ఇంటికి సేవ చేశానని వాళ్లను అడిగితే తెలుస్తుందన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు.



సీఈసీ జ్ఞానేష్ కుమార్

రాజీనామా చేయాలి

48 గంటల్లోగా తప్పుకోకపోతే 'జంతర్ మంతర్ 2.0'

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపే్


ఢిల్లీ, ఆయుధం:

ఓటర్ల హక్కులను కాలరాస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. 48 గంటల్లోగా ఆయన తప్పుకోకపోతే 'జంతర్ మంతర్ 2.0' తరహాలో దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని CJP వ్యవస్థాపకుడు అభిజీత్ దీపే్మ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా రిగ్గింగ్ చేశారని, పౌరుల ఓటుహక్కును అన్యాయంగా హరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతోందని భావిస్తున్న ప్రతిపక్ష పార్టీలు ఆ ఎన్నికల్లో పాల్గొనకూడదని ఆయన సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా జరగడం లేదని తెలిసినప్పుడు అందులో విపక్షాలు ఎలా పాల్గొంటాయని ప్రశ్నించారు. దీనిపై కచ్చితంగా ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలని ప్రతిపక్షాలను దీపే్మ కోరారు. భారత ప్రజాస్వామ్యానికి CEC జ్ఞానేష్ కుమార్ అతిపెద్ద ముప్పుగా మారారని, ఎవరు ఓటు వేయాలో కూడా ఈసీనే నిర్ణయిస్తోందని ఆరోపించారు. పౌరుల ఓటు హక్కును రద్దుచేయడానికి జ్ఞానేష్ కుమార్‌కు ఉన్న అధికారమేంటని ప్రశ్నించిన ఆయన సీఈసీపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు రెడీ



2 లో



2 లో

అధికారులూ..

అలర్ట్

- భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశాలు

ప్రభుత్వ అసమర్థతతోనే..

కరెంట్ కోతలు

ప్రజలకు చెప్పకుండానే కరెంట్ కోతలు.. కేటీపీపీని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు

- రైతులకు, ప్రజలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్..

గణపురం, ఆయుధం: రాష్ట్రంలో కరంట్ కోతలకు ప్రభుత్వ అసమర్థతే కారణమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. గురువారం చలో కేటీపీపీ పేరుతో గణపురం మండలం, చెల్పూర్ గ్రామంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, శంకర్ నాయక్, మాజీ చైర్పర్సన్ బడే నాగజ్యోతి, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. 24గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

కరెంట్ కోతలకు ప్రభుత్వ అసమర్థతే కారణమని ఏద్దేవా చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నడపకపోవడం,బొగ్గు నిల్వల నిర్వహణలో వైఫల్యం కారణంగానే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఇళ్లు, రైతులకు విద్యుత్ కోతలు తప్పడం లేదని విమర్శించారు. విద్యుత్ సమస్యపై బీఆర్ఎస్ కార్యకమాన్ని అడ్డుకునేందుకు తెల్లవారుజామునే నాయకులను అరెస్టు చేయడం ప్రభుత్వ భయానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇళ్లకు కూడా ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని,ఈ పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, విద్యుత్ రంగంలో సరైన నిర్వహణ లేకపోవడమే కారణమని అన్నారు.



భూపాలపల్లి ప్రాంతంలోనే రెండు ఓపెన్‌కాస్ట్ గనులు ఉండటంతో పాటు తాడిచర్లలో కూడా బొగ్గు గనులు ఉన్నాయని, ఇంత పెద్ద బొగ్గు నిల్వలు ఉన్న ప్రాంతంలోనే విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కొరత ఏర్పడటం పాలనా లోపాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. సింగరేణి-జెన్‌కో మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలు, బకాయిల అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాకు కావాల్సింది రాజకీయాలు కాదు.. కరెంట్ అని అన్నారు. రైతులకు సాగునీటి కోసం కరెంట్ కావాలి, ఇళ్లకు నిరంతర విద్యుత్ కావాలి, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కావాలని అన్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోతే పరిశ్రమలు, వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా,తక్షణమే విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు,ప్రభుత్వ పాలనా వైఫల్యంతో ఏర్పడిన విద్యుత్ సంక్షోభం అని అన్నారు. రైతులకు, ప్రజలకు (మిగతా 2 లో..)



జ్ఞానేశ్ కుమార్ తక్షణమే

రాజీనామా చేయాలి

- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

ఢిల్లీ, ఆయుధం: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు.

మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకు ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ అపూవర్‌గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిమజ్జనం పూర్తయ్యే వరకు

అప్రమత్తంగా ఉండాలి

చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జన ప్రక్రియను పరిశీలించిన సీపీ శ్వేత, బల్దియా కమిషనర్ వెంకన్న

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గణేశ్ నిమజ్జన ప్రక్రియను వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రక్రియ కొనసాగుతున్న తీరు, భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నిమజ్జనం పూర్తయిన గణేశ్ విగ్రహాల సంఖ్య, ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల వివరాలను సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గణేశ్ విగ్రహాలను సాధ్యమైనంత త్వరగా నిమజ్జన కేంద్రాలకు తీసుకువచ్చి నిమజ్జనం పూర్తిచేసుకునేలా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సీపీ శ్వేత, కమిషనర్ వెంకన్న సూచించారు. పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా నిమజ్జనం పూర్తైన వెంటనే విగ్రహాల అవశేషాలు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కమిషనర్ వెంకన్న ఆదేశించారు. ఈ పరిశీలనలో GWMC సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల సమీక్ష

- హాజరుకానున్న మంత్రి సీతక్క

హనుమకొండ, ఆయుధం: హనుమకొండలోని ఐఓడీసీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క సమీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటకు హన్మకొండ ఐఓడీసీలో ఈ సమీక్షా సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అక్టోబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన నివారణ, ముందస్తు చర్యలు, అలాగే సంబంధిత కార్యాచరణ ప్రణాళికపై ప్రధానంగా సమీక్షించనున్నారు. అదేవిధంగా, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఇతర భవనాల నిర్మాణ పనుల పురోగతి, వాటి పూర్తి స్థితి, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో చర్చించనున్నారు. హ్యామ్ రహదారుల నిర్మాణ పనుల పురోగతి, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి, పెండింగ్ పనులు, భవిష్యత్ కార్యాచరణపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షా సమావేశానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ENC లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన అడిషనల్ కలెక్టర్లు, జిల్లా పరిషత్ సీఈఓలు, డీఆర్డీఓలు, డీపీఓలు, ఈఈలు, రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొననున్నారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ శాఖలకు సంబంధించిన తాజా గణాంకాలు, పురోగతి నివేదికలు, పెండింగ్ పనుల వివరాలు, పూర్తి చేయడానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికతో హాజరు కావాలని స్పెషల్ సీఎస్ దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు.



బాలిక సదనం నుంచి

మరో దత్తత

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- బాలికను అభినందించిన కలెక్టర్

హనుమకొండ, ఆయుధం: ప్రభుత్వ బాలిక సదనంలో రక్షణ సంరక్షణ విద్యా బుద్ధులు నేర్చుకొని తన ఇష్టాలకు అనుగుణంగా దత్తతకు ఒప్పుకొని కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రోజున నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు కలెక్టర్ ఛాంబర్ లో చట్టబద్ధమైన దత్తత అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరమని అన్నారు. కాగా, దత్తత కి ఇచ్చిన బాలికతో, దత్తత తీసుకున్నతల్లితండ్రులతో కలెక్టర్ మాట్లాడి దత్తత తీసుకొన్న బాలికను బాగా చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎం.కల్యాణి, ఇంచార్జి డిసిపివో ఎస్.ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు రెడీ

ఢిల్లీ, ఆయుధం:




ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు ఇటీవల జాతీయ మీడియాలో కథనాలు రావడంతో విపక్షాలు అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి తీర్మానం ముసాయిదాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యాయని, న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం వారం రోజుల్లో ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

సీఈసీపై నోటీసులకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్షాలు కలిసి పనిచేస్తున్నాయని తెలుస్తోంది. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విపక్షాలు.. పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టడం మూడోసారి కావడం గమనార్హం. గతంలో ఓసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చినప్పటికీ అవి తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత సీఈసీని తొలగించాలని కోరుతూ ఏప్రిల్ 24న 73 మంది విపక్ష ఎంపీలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుతం అది రాజ్యసభలో పెండింగులో ఉంది. తాజాగా ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరమీదకు రావడంతో ప్రధాన కమిషనరు తొలగింపునకు విపక్షాలు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

అధికారులూ.. అలర్ట్

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



- **చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**
- **ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి**
- **గూగుల్ మీట్ ద్వారా హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశాలు**

హనుమకొండ, ఆయుధం: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలపాటు వర్షాలకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో వర్షాల సమయంలో సమస్యలు ఎదురైన ప్రాంతాల వివరాలను తెలుసుకుని, ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లాలోని వేలేరు , ఆత్మకూర్ మండలాల్లో బుధవారం కురిసిన వర్షంతో అధిక వర్షపాతం నమోదైందన్నారు. నేడు, రేపు (గురువారం, శుక్రవారం)కూడా ఆకస్మికంగా భారీ వర్షపాతం నమోదైతే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపట్టాలన్నారు. చెరువులు, వాగులు, వంకల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉందో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపాతం పెరిగినప్పుడు చెరువుల నీటిమట్టం, నీటి ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. భారీ వర్షాల సమయంలో అధికారులు తమ పరిధిలో స్థానికంగానే అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రస్తుతం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించాలని ఆదేశించారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను వెంటనే తొలగించాలన్నారు. ప్రధాన నాలాల వద్ద వరద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలాగే అన్నీ మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సమయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్కడ సమస్య తలెత్తే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులు, వాగులు, వంకలు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా వర్షాల కారణంగా జరిగిన నష్టం పై వెంటనే వివరాల నివేదికను అందజేయాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినప్పుడు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ గూగుల్ మీట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, రోడ్లు,భవనాలు శాఖ ఈఈ దేవిక చౌహన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



యూజీడీ భూసేకరణ ప్రక్రియను
త్వరగా పూర్తి చేయాలి

- **కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి**
- **కలెక్టరేట్ లో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమీక్ష**

హనుమకొండ, ఆయుధం: గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కి (యూజీడీ) సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో యూజీడీ కి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు), సీవరేజ్ పంపింగ్ స్టేషన్లు, లిఫ్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ అంశాలను కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొత్తం 23 ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై అధికారులను కలెక్టర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... భూసేకరణకు సంబంధించిన ప్రక్రియను అధికారులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. యూజీడీ పనుల అమలుకు భూసేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, తహసీల్దార్లు, భూ సేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.





వరంగల్, ఆయుధం:

భారీ వర్షాలు.. విరిగిపడిన చెట్లు

- **తొలగించిన బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది**

భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రోడ్డుపై విరిగిపడిన చెట్లను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డీఆర్ఎఫ్ బృందాలు వేగంగా తొలగించి రాకపోకలను పునరుద్ధరించాయి. హనుమకొండ ఎక్సైజ్ కాలనీ, ప్రభుత్వ టీబీ ఆసుపత్రి, దేవన్నపేట ప్రధాన రహదారి, సమ్మయ్యనగర్ ప్రాంతాల్లో చెట్లు నేలకొరగడంతో డీఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ టీబీ ఆసుపత్రి వద్ద విద్యుత్ స్తంభం, తీగలపై పడిన భారీ వృక్షాన్ని కూడా సురక్షితంగా తొలగించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ శంకర్‌లింగం నేతృత్వంలో జరిగిన ఈ చర్యల్లో ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మొగుళ్ళపల్లి, ఆయుధం: తమతోపాటు కలిసి చదువుతున్న మిత్రునికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని రంగాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల S.S.C.2009వ సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ కి చెందిన ఆకుతోట దినేష్ తండ్రి ఆకుతోట ఆదిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో ఆకుతోట దినేష్ తో కలిసి చదువుకున్న స్నేహితులు తమ మిత్రుడికి 14వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. తమతో చదువుకున్న మిత్రుడి తండ్రి మృతి చెందడంతో ఆర్థిక సాయం అందించి తోడుగా నిలిచారు. ఈ అన్నపురెడ్డి కుమారస్వామి, గిరుగుల విక్రం, అచ్చ ప్రశాంత్, బుర్రి కిరణ్, ఇంజపెల్లి అశోక్, రాజు, మహేష్, తిరుపతి దయాకర్ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారిణులకు మున్నూరు కాపు
పరపతి సంఘం అండ

వరంగల్, ఆయుధం: క్రీడాకారిణుల అభివృద్ధికి మున్నూరు కాపు పరపతి సంఘం అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా వరంగల్ జిల్లా కబడ్డీ క్రీడాకారిణులకు వసతి సౌకర్యం కల్పిస్తూ, సీసీ కెమెరాల పర్యవేక్షణలో భద్రతను అందిస్తున్న సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులకు అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు పరపతి సంఘం వసతి గృహంలో ఉంటూ శిక్షణ పొందిన క్రీడాకారిణులు గత ఏడాది రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ విజయానికి సంఘం అందించిన వసతి, సహకారం, ప్రోత్సాహం ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. క్రీడాకారుల పట్ల సంఘం చూపుతున్న ఆదరణ,బాధ్యతాభావాన్ని ఎన్నటికీ మరువలేమన్నారు.

ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు వేములవాడలో జరగనున్న 35వ సబ్‌జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే వరంగల్ జిల్లా జట్టుకు వారం రోజుల పాటు వసతి సౌకర్యం కల్పించాలని మున్నూరు కాపు పరపతి సంఘం నిర్వాహకులను కోరారు. అదేవిధంగా అక్టోబర్‌లో నిర్వహించనున్న జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు హాజరయ్యే వరంగల్ జిల్లా కబడ్డీ జట్టుకు కూడా వసతి సౌకర్యం కల్పించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడాకారిణులకు వసతి కల్పించడంతో పాటు వారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం సహకరిస్తున్న మున్నూరు కాపు పరపతి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కీ.శే బండి చిన్న కుమారస్వామి, గౌరవ అధ్యక్షులు తోట రమేష్, అధ్యక్షులు బండి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు బొల్లం ప్రతాప్, ప్రధాన కార్యదర్శి లక్కాకుల శ్యాం, సహాయ కార్యదర్శి ఆవుల సుధాకర్, కోశాధికారి బండి వీరన్న, సహాయ కోశాధికారి కొమ్మినేని రాజేందర్, ఆర్గనైజర్స్ బండి మోహన్, మొగిలి శెట్టి సంజీవరావు, ముఖ్య సలహాదారులు మాజీ కార్పొరేటర్ పల్లం రవి, తోట సారయ్య, ఓగిలిశెట్టి అనిల్, కస్తూరి నాగరాజ్, కార్యవర్గ సభ్యులు తోట సుధాకర్, ఆవుల శ్రీనివాస్, పల్లం సురేష్, కోల చంద్ర మౌళి, తోట సురేష్, గజ్జల ఉపేందర్, లక్కాకుల రాజు, పల్లంరాజులకు వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ క్రీడాకారుల అభివృద్ధికి ఇదే విధమైన సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు.

వ్యర్థాలు ఎప్పటికప్పుడు
తొలగించాలి



వరంగల్, ఆయుధం; గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న గురువారం ఉదయం ఉరుసు చెరువు నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. నిమజ్జనం అనంతరం చేపట్టిన, చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులు, వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలీస్ అధికారులతో నిమజ్జన తీరును సమీక్షించి, సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వ అసమర్థతతోనే కరెంట్ కోతలు

(మొదటి పేజీ తరువాయి..)

ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును అందుబాటులో ఉంచాలని, నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశంలోని 29 రాష్ట్రాల్లో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తెలంగాణ రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు.

ఉమ్మడి పాలనలో కరెంట్ కోతలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో అరుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారని, తెలంగాణ ఉద్యమమే కరెంట్ పోరాటాల నుంచి పుట్టిందని గుర్తుచేశారు.

సింగరేణి సంస్థకు జెన్‌కో విభాగం రూ.52 వేల కోట్ల బకాయిలు ఉండటంతో బొగ్గు సరఫరా నిలిపివేశారని ఆరోపించారు. రికార్డుల్లో 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపుతున్నా వాస్తవంగా నిల్వలు లేవన్నారు. నాణ్యమైన బొగ్గును ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు విక్రయిస్తూ తెలంగాణ ప్రాజెక్టులకు సరఫరా చేయడం లేదని విమర్శించారు. కేటీపీపీకి రోజుకు 5,000 టన్నుల బొగ్గు అవసరం ఉండగా కేవలం 1,500 టన్నులు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి, భూపాలపల్లి ప్లాంట్లలో సగానికిపైగా యూనిట్లను షట్‌డౌన్ చేసి కృత్రిమ విద్యుత్ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు.తాము వస్తున్నామని తెలిసి రెండు యూనిట్లను నడుపుతున్నట్లు చూపిస్తున్నారని, తమ పర్యటన ముగిసిన తర్వాత మళ్లీ షట్‌డౌన్ పేరుతో మూసివేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. మంత్రులు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా దోపిడీలో మునిగిపోయారని ఆరోపించారు. విద్యుత్ శాఖ మంత్రి కమీషన్ల వేటలో ఉండగా, ఇన్‌చార్జి మంత్రులు 30,40 శాతం వాటాల కోసం భూముల పంచాయితీలు, రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రికి కూడా రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రుల కంటే పెద్ద రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఎవరూ లేరని ఎద్దేవా చేశారు.





ఎస్ఐఆర్ పురోగతి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పై సమావేశం

హనుమకొండ, ఆయుధం: జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా డీనోవా తయారీపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి నిర్వహించారు. గత గురువారం నుంచి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా డినోవా తయారీకి సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి కొత్తగా గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికల సంఘం సూచించిన మేరకు పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ, ఐనవోలు మండలాల తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, విక్రమ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వి.శ్రీనివాస్ రావు, రావు అమరేందర్ రెడ్డి, జి.ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఫైజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధులు మార్గదర్శకులు

- **కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



హనుమకొండ, ఆయుధం: వయో వృద్ధులు మన జీవితానికి మార్గదర్శకులని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహించ తలపెట్టిన వారాంతపు కార్యక్రమాలపై జిల్లా అధికారులు, వయో వృద్ధుల అసోసియేషన్ వారితో గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ రివ్యూ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా షెడ్యూల్ ప్రకారం అన్నీ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రతి వృద్ధాశ్రమంలోని వయో వృద్ధులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి కేంద్రాన్ని సంబంధిత అధికారులు సందర్శించాలని, యోగా ప్రాణాయామంపై అవగాహన కల్పించాలని, క్యారమ్, చెస్ పాటల పోటీలతో వారిలో నూతన ఉత్తేజాన్ని నింపాలని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ లో తల్లి తండ్రులు వయో వృద్ధులు పోషణ, సంక్షేమ చట్టం 2007, నియమావళి 2011, మ సవరణ నియమావళి 2011 యాక్ట్ పై రూపొందించిన ఫోమ్ బోర్డ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న వయో వృద్ధుల కేంద్రాలు పాటిస్తున్న కనీస ప్రమాణాలు సంబంధిత నివేదికలు సత్వరమే అందించాలని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల సమాచార సంచిక, గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు.



ఈ సమావేశం లో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ టి మదన్ మోహన్ రావు, ఏడీఆర్డిఓ వెంకటేష్, జీసిడివో ఎస్ సునీత, ఏసీపీ సదయ్య, సిడిపిఓ లు వి సింధురాణి, సిహెచ్ అవంతి, ఎస్ఐ శ్రావణి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు దేవాచారి,చంద్రమౌళి, ధర్మరాజు, లార్డ్ వృద్ధాశ్రమ నిర్వాహకులు నరేష్, జిల్లా మహిళా సాధికారత మిషన్ సమన్వయకులు దొమ్మేటి కల్యాణి, ఇంచార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, ప్యానల్ అడ్వకేట్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- **బల్దియా కమిషనర్ టి. వెంకన్న**

వరంగల్, ఆయుధం: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర విభాగాల అధికారులతో కమిషనర్ టి. వెంకన్న టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్‌ఫ్రీ: 1800 425 1980 కంట్రోల్ రూమ్: 9701999645 వాట్సాప్: 9701999676 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695